


# "ఛే" కారు యోగం

ఆవార్త వినగానే సుబ్బారావు 'థాం' అని పడిపోయాడు చాపచుట్టలా. సుబ్బారావు మూర్ఛరోగి కాదు. ఆమాట కొస్తే అటు ఏడుతరాలు – ఇటు ఏడు తరాలు ఎటుచూసినా అటువంటి జబ్బులు సుబ్బారావు వంశంలో లేవు. మంచి ఆరోగ్యంగా – అందంగా – దేవుడిచ్చిన ఉద్యోగం చేసుకుంటూ గుట్టుగా బ్రతుకీడుస్తున్నాడు సుబ్బారావు. ఖర్మకాద్దీ నెలరోజుల క్రిందట ఓ పెద్ద కలరు టీవీ కొన్నాడు భార్యామణి పోరు భరించలేక. నిజానికి అది కొనడం అతనికిష్టం లేదు. 'ఏరాయి అయితేనేం పళ్ళు ఊడగొట్టుకోవడానికి' అంటూ చాలాకాలం ఆమె కోరికను తిరస్కరిస్తూ వచ్చాడు. ఎందుకంటే టీవీ అతను చూడ్డం మానేసి చాలాకాలమైంది. ఆఫీసుకు ఉదయం తొమ్మిదికి పోతే రాత్రి ఎనిమిదికి గాని రాడు. ఆదివారం వచ్చిందంటే హాబీగా దుప్పటి తన్ని నిద్రపోతాడు. ఆరోజు పిడుగులు పడ్డా – భూకంపం వచ్చినా తను నిద్ర పోవలసిందే! పట్టుమని పదినిమిషాలు కూడా టీవీ ముందు కూర్చోడు. మరి అటువంటి వాడికి టీవీ మజా ఏం తెలుస్తుంది కనుక, గాడిద కేం తెలుస్తుంది గంధపు చెక్క రుచి?

చివరికి సులోచన, సుబ్బారావు భార్య, ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. సుబ్బారావు చర్మం, సగటు భారతీయుడి చర్మం లాగా, మందం కాబట్టి, మర్మంగా నవ్వుకుని ఊరుకుండిపోయాడు. కాని ఆమె తన చావుకు కారణం సుబ్బారావని వాగ్మూలం తయారు చేసి – చూపించేసరికి – అది ఎక్కడ యస్.పి.కీ, తన ఆఫీసు మేనేజరుకూ పంపిస్తుందోనని భయపడి – పాత డొక్కు టీవీని అయిన కాడికి ఎక్చేంజికి యిచ్చేసి కొంగ్రొత్త హంగులతో వున్న కలరు టీవీ కొనడానికి ఒప్పుకున్నాడు. పండుగల సీజను కాబట్టి అదేదో కంపెనీ ఎలక్ట్రానిక్ ఉత్సవం నిర్వహిస్తూ – టీవీ కొన్నవాళ్ళకి ఒక లాటరీ టికెట్టు ఫ్రీగా యిచ్చింది. ఆ డిప్పులో యిప్పుడు సుబ్బారావుకు ఓ పెద్ద కారు తగిలింది. అతన్ని అమ్మి తగలేసినా జీవితంలో ఎప్పుడూ అంతమంచి పెద్ద కారు కొనలేడు అతను – అందుకని అతను షాక్

వచ్చి పడిపోయాడు.

కరువు కాలంలో ఓ బక్కెట్టు నీళ్ళు గుమ్మరించిం తర్వాత బకెట్టు తన్నకుండా లేచి కూర్చున్నాడు సుబ్బారావు.

ఎదురుగా పెద్ద పెద్ద కళ్ళతో సులోచన చిందులేస్తూ కనిపించింది. అప్పుడే ఆవార్తను ఆమె ఇరుగు పొరుగుకు చేరవేసింది. ఇంటిముందు ఓ గుంపు పోగయి పోయి అతని అదృష్టానికి అతన్ని అభినందిస్తున్నారు. చిరుద్యోగి సుబ్బారావుకు గురుద్యోగులకు కూడా లేని కారు తగలడం. అక్కడి కొచ్చిన వారికెవరికీ మింగుడు పడకపోయినా అభినందిస్తున్నారు.

సులోచనకు అన్నీ సద్గుణాలే కాని - రెండే రెండు దుర్గుణాలే ఉన్నాయి - అవి ఏంటంటే - ఒకటి తనకు తెలియదు - యింకోటి ఎవరు చెప్పినా వినదు. అందుకే అంత ఆనందం!

"ఒసే! మనకు కారెందుకే! అది వద్దంటే ఎంత క్యాష యిస్తాడో అంత పుచ్చుకుందాం! " అంటూ ఆ రాత్రి సులోచనకు నచ్చ చెప్పబోయాడు.

ఆమె మళ్ళీ ఛస్తానన్న బ్రహ్మాస్త్రం ప్రయోగించింది.

పైగా ఇద్దరి పిల్లల్ని కూడా అతని పైకి ఉసి గొల్పింది.

" అది కాదే సులోచనా - నా ఆలోచన విను - ఓ ఐదు లక్షలో ఎంతో వస్తే దాన్ని ఫిక్సుడు డిపాజిట్లులో పడేద్దాం - భవిష్యత్తులో పిల్లదాని కట్నానికో - పిల్లాడి చదువుకో పనికొస్తుంది. ముసలాడికి దసరా పండుగలాగా - మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె లాగా - ఆ ఐరావతం మనకెందుకే ! చేసేది గుమాస్తా ఉద్యోగం - కారులో తిరిగితే నవ్వుతారే !" అతని మాటలు పూర్తికాకుండానే ఆమె కాళిలా విరుచుకు పడింది.

" హూ ! మీరు కొనలేరు - దేవుడిస్తే సహించలేరు. మన జీవితంలో మనం ఎప్పుడన్నా అనుకున్నామా కారులో తిరుగుతామని? ఏదో దేవుడిదయ ! ఆ టీవీ దయ ! ఆ టీవీ కూడా వద్దని చంపారు. అది కొనబట్టే కదా మనకీ అదృష్టం కల్సివచ్చింది. మీ మాటలు విని యిన్ని సంవత్సరాల్లో ఎన్నో కొనకుండా నేనెంత అదృష్టం కోల్పోయానో! ఏమో ఎవరు చూడొచ్చారు కారు యిచ్చిన దేవుడు - పెద్ద బంగళాను కూడా యిస్తాడేమో ! " అంటూ రాజకీయ నాయకుల కంటే ఎక్కువ ఆశావాదాన్ని ప్రకటించింది.

సుబ్బారావు చేతులు ఆమె అలా కట్టివేయగా - పేపర్లలో పెద్ద పెద్ద అక్షరాలతో అతని ఫోటోలు - కారు ఫోటోలు - కేబుళ్ళల్లో అతని - సులోచన ఇంటర్వ్యూలు ప్రసారం కావటంతో విధిలేక సుబ్బారావు ఆ ఆలోచన మానుకోవలసి వచ్చింది. కారు పుచ్చుకోవలసి వచ్చింది. పార్టీలు యివ్వడానికే ఓ పదివేలు ఖర్చయిపోయాయి.

కోతికి కొబ్బరికాయ యిచ్చిన చందాన - సుబ్బారావుకు డ్రైవింగ్ రాదు - అతనికి సైకిలే రాదు - ఇంక కారు ఎలా నేర్చుకుంటాడు. అందుకని ఇరుగు పొరుగు వాళ్ళే వీళ్ళ అనుమతి లేకుండా నెలకు నాలుగు వేలకు ఒక డ్రైవర్ని కుదిరించి పెట్టారు.

'జీహుజూరు' అంటూ అతను ప్రొద్దున్నే ప్రత్యక్షం కావడం భలే ఖుషీగా ఉంది సులోచనకు.

అతని డ్యూటీ ప్రొద్దున సుబ్బారావును ఆఫీసు దగ్గర దింపడం - అంతకు మునుపు వారి పిల్లల్ని - పక్కింటి పిల్లల్ని స్కూలు దగ్గర వదలడం - సుబ్బారావును దింపిన తరువాత ఇంటికి రావడం - సులోచన తన పొరుగు వారితో కల్సి షాపింగు చేసి రావడం వగైరాలు. మధ్యాహ్నం కాస్త బ్రేక్ - సాయంత్రం యధావిధిగా - పిల్లలు - సుబ్బారావును పట్టుకొచ్చెయ్యడం - కాకుండా కారులో సాయంత్రం మళ్ళీ షికారుకు పోయిరావడం.

కారులో తిరుగుతుంటే సులోచనకు ప్రపంచాన్ని జయించినంత సంబరంగా ఉంది - ఎటొచ్చీ సుబ్బారావుకే దుఃఖం తన్నుకొస్తున్నది. అతడి బ్యాంకు బాలెన్సు హారతి కర్పూరంలా కరిగిపోతున్నది.

ఒక్క నెల తిరిగే సరికి కారు క్రింద పదివేలు దాటింది. లబలబ కొట్టుకున్నాడు - అయినా సులోచన వింటేగా ! ఆమెకు వంత పాడటానికి చెల్లమ్మా - అక్కయ్యా - వదినా అంటూ ఇరుగుపొరుగు తయారు - సులోచన పుణ్యమంటూ వారికి చాలా పన్లు ఖర్చులేకుండా జరిగిపోతున్నాయి.

సులోచనకు కాస్త చొరవ జాస్తీ ! డ్రైవర్ దగ్గర డ్రైవింగు పాఠాలు నేర్చుకోసాగింది. 'మనకెందుకే అవన్నీ' అని సుబ్బారావు గునిసినా పట్టించుకోలేదు. పైగా పెళ్ళాల దగ్గర మొగుళ్ళ మాటలకు విలువ ఉండదు గదా!

డ్రైవింగు నేర్చుకుంటూ పోయి ఒకరోజు రోడ్డుకడ్డంగా ఉన్న ట్రాఫిక్ పోలీసునే ఢీ కొట్టింది. సమయానికి పక్కనుండే డ్రైవరు గట్టిగా బ్రేకులు వేయబట్టి సరిపోయింది.

ఎంత 'యల్' బోర్డు ఉన్నా పోలీసుకు కోపం రాకుండా ఉంటుందా! సులోచన పైన కేసు బుక్ చేశాడు. కక్ష సాధింపులు మొదలెట్టాడు.

దాన్నుండి బయటపడటానికి సుబ్బారావుకు తలప్రాణం తోక కొచ్చింది. పోలీసు స్టేషను చుట్టూ తిరిగి బోల్డంత లోకజ్ఞానం వచ్చింది.

సులోచన కారు కాదు గాని సుబ్బారావుకు ప్రాణం మీదకొచ్చింది. వరద బాధితుల సహాయార్థం మహిళా సభ్యులు ఒక గ్రామానికి పోయి కొన్ని ఆహారపదార్థాలు - బట్టలు పంచదలచుకున్నారు. ఆరోజు చక్రధారికి వంట్లో బాగోలేక రాలేకపోయాడు. మహిళా మండలి సభ్యులు కొన్ని కార్లల్లో పోదల్చుకున్నారు. దాంలో సులోచన కారుంది. చక్రధారి

రాకపోయినా - సుబ్బారావు వద్దని మొత్తుకున్నా - స్వయంగా తనే చక్రం తిప్పుతూ గ్రామానికి బయలుదేరింది సులోచన మరో ఆలోచన లేకుండా.

మనిషి ఒకటనుకుంటే దేవుడు యింకోటి అనుకుంటాడు!

వచ్చేటప్పుడు కారుకాస్తా బురదలో యిరుక్కుపోయింది - పైగా యింజను ట్రబుల్ యిచ్చింది. ఇంకేముంది హాహాకారాలు !

ఆ గ్రామంలో వరద దెబ్బకు ట్రాక్టర్లు - వగైరాలు పనిచేయడం లేదు. చివరికి ఎడ్లబండి కట్టించుకుని - ఎడ్లబండితో కారును లాగించుకుంటూ యిరవై కిలోమీటర్లు పయనించి కర్నూలు చేరుకోవలసి వచ్చింది. అర్ధరాత్రి ఆమె యిల్లు చేరేదాకా సుబ్బారావు ఆందోళన అంతా యింతా కాదు, ఎడ్లబండి వాడికి మూడువేలు యిచ్చినా తృప్తి పడలేదు వాడు.

ఈ నడమంత్రపు సిరివలన సుబ్బారావుకు యింకో దెబ్బపడింది.


అది దానాల దెబ్బ ! దానం వెనుక ఎవరో ఒకరి బలం ప్రధానంగా ఉంటుంది నిదానంగా తెల్సుకుంటే.

ఆఫీసుకు ప్రతినెలా కొందరు ఏవో కార్యాలకు డొనేషన్లు యిమ్మంటూ వస్తూ ఉంటారు. అంతకుముందు పాతికో - పరకో యిస్తూ ఉంటే ఎవరూ పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు కారున్న హీరో కాబట్టి కనీసం నూటపదహార్లు యివ్వంది పోవడం లేదు అర్థులు. దాంతో తృప్తి పడక అతగాణ్ణి పీనాసివాడి క్రింద జమ కడుతున్నారుకూడ.

ఆ బాధ సులోచనకీ తగిలింది. వరద బాధితుల సహాయం కోసం వచ్చేవారు ఆమెను ఉబ్బించి వెయ్యినూటపదహార్లు తీసుకువెళ్ళేవాళ్ళు. ఒకరికైతే ఫర్వాలేదు - యిలా చాలా సంస్థలు ముందుకొచ్చి విరాళాలు సేకరించాయి. ఆ విరాళాలలో నిజంగా వరద బాధితులకు ఎంత అందుతుందో - సేకరించిన వారికి ఎంత దక్కుతుందో తెలియదు.

కాగా, కారు లాటరీలో తగిలిందని తెల్సి సులోచన తాలూకు చుట్టాలు అడపాదడపా రాసాగారు. వారికి కారులో ఊరు చూపిస్తే సరిపోవడం లేదు. చుట్టు ప్రక్కల గల పుణ్యక్షేత్రాలయిన - అలంపురం - మహానంది - మంత్రాలయం - అహోబిలం- యాగంటి లాంటివి చూపించాల్సి వస్తున్నది. ఎవరైనా డీజలు కొట్టిస్తారాంటే - ఆమాట ఎత్తరు. అడగడానికి మొహమాటం! కారు ఖర్చు అటుంచి చుట్టాలు వచ్చినప్పుడు వంటింటిలోని వెచ్చాలకు రెక్కలు మొలుచు కొస్తున్నాయి. కిరాణా అంగడిలోని ఖాతా హనుమంతుడి తోకలాగా పెరిగిపోతున్నది.

ఈమధ్య కారు పార్కింగుతో సమస్య ఏర్పడుతున్నది. కారు షెడ్డు లేక పోవడం వలన సుబ్బారావు కారును ఇంటిముందు రోడ్డుమీద పార్కు చేస్తున్నాడు. దాని మూలంగా


ఏడుకొండలవాడా!
వేంకటరమణా!!
రక్షించు! రక్షించు!!
భక్తా!
ఏంకావాలి?!
ధనమా!?
కాదు..
స్వామీ!!
మరి.. భూములా!
ఎన్ని వేల
ఎకరాలు కావాలి!?
మీ దయవల్ల అన్నీ ఎక్కువగా వున్నాయి!
నా అక్రమ సంపాదన, దాని సాక్ష్యాలూ!
అదృశ్యంగా వుండి అవసరమైనప్పుడు
కనబడాలి!!

పబ్లిక్కుకు ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నది. కాగా పిల్లలు ఆడుకునే ఆటల్లో బంతులు, కర్రబిళ్ళలు వగైరాలు తగిలి కారు సొట్టలు పడుతున్నది. దార్నపోయే పిల్లకాయలు ఎలాగూ కారుమీద గీతలు గీస్తూ ఉంటారు. కొన్ని వాహనాలు కూడా రాచుకు పోతూంటాయి.

" ఏవండీ ! మనం ఇల్లు మారదాం ! కారు షెడ్డు ఉన్న ఇంటికి పోదాం!" అని సులోచన టెండరు పెట్టింది. అంతటితో ఊరుకోకుండా రెండు వీధుల అవతల ఒక మంచి అపార్టుమెంటు తీసుకుంది - కింద పార్కింగు ఉందని. దాంతో ఇంటి అద్దె మూడునుండి ఐదువేలకు ఒక్కసారిగ పెరిగిపోయింది.

సుబ్బారావు జీతం మటుకు గొర్రెతోక బెత్తెడు లాగానే పెరగకుండా అలాగే ఉంది. ఖర్చుమటుకు ద్విగుణీకృతమైపోయింది.

" కారు మనకంత అవసరమా ? ఆలోచన చెయ్యి సులోచనా !" బ్రతిమాలు కున్నాడు- దీనంగా - బ్యాంకు పాసుబుక్కులోని బ్యాలెన్సు చూసి.

" కారు భరించలేక మనం దివాళా తీశామని పుకార్లు షికార్లు చేస్తాయి. ఒకసారి పరువు పోయింతర్వాత బ్రతికి లాభం లేదు!" సులోచన సాలోచనగా చెప్పింది- తన స్నేహితురాళ్ళ నోళ్ళ గురించి గుర్తు చేసుకుంటూ.

" మన బ్రతుక్కి పరువు అంత ముఖ్యమా?" ఏడ్పుగొంతుతో అడిగాడు.

" మీకుందో లేదో నాకు తెలీదు కాని ఈ సులోచనకు సంఘంలో పరువు ప్రతిష్టలున్నాయి. అవి పోగొట్టుకోవడం నాకెంతమాత్రం యిష్టం లేదు- ఎంత కష్టమైనా సరే!" ఇష్టసఖి స్పష్టం చేసింది.

" కారు అన్నది ఢిల్లీ లడ్డులాగయిపోయింది. తినే దాకా నోరు ఊరిస్తుంది. తిన్న తర్వాత ఎందుకు తిన్నామాని బాధ కలిగిస్తుంది." నిట్టూర్చాడు సుబ్బారావు.

" అందుకే మీరేం చేస్తారో నాకు తెలీదు. కారు మటుకు మనకుండాలి! కావాలంటే యితర ఆదాయాలకోసం ప్రయత్నించండి. తెలివైన వాడు అవసరాలను తగ్గించుకోడు - ఆదాయాలను పెంచుకుంటాడు." హితబోధ చేసింది.

సుబ్బారావు స్టేటస్ ఆఫీసులో పెరిగి పోయింది. ప్యూను కూడా నమస్కారం పెడుతున్నాడు. ఆఫీసరు అప్పారావు ఫ్యామిలీతో వినోద పర్యటనకు బయలు దేరుతున్నాడు - ఆ సందర్భంలో అప్పారావు భార్య అప్పలమ్మ గుర్తు చేసింది.

లాటరీలో సుబ్బారావుకు కారు అప్పనంగా వచ్చిన సంగతి కడుపుమండి. పైగా ఆఫీసరుగారిది పాతడొక్కు కారు. అది ఎక్కడ ఆగిపోతుందో బ్రహ్మకు కూడ తెలియదు.

" సుబ్బారావు ! నీ కారు ఓ మూడు రోజులు కావాలయ్యా ! మా ఆవిడ అహోబిళం, మంత్రాలయం - మహానంది - శ్రీశైలం వగైరా పుణ్యతీర్థాలు పోదామంటున్నది.

మామూలుగా అయితే ఓ పెద్ద కారు అద్దెకు తీసుకునే వాళ్ళం. కాని మా ఆవిడే చెప్పిందోయ్ - సుబ్బారావు వున్నాడు గదా - మనం అద్దెకు తీసుకుంటే బాధ పడతాడని చెప్పింది. కాబట్టి - పెట్రోలు నేను పోయించుకుంటాను -డ్రైవర్ భత్యం నేనే యిస్తాను - కాబట్టి కారు ఎల్లుండి నుండి ఓ మూడు రోజులు పంపు!" ఆఫీసరు ఆర్డరు వేశాడు. సుగ్రీవాజ్ఞ అది.

సులోచనకు నచ్చచెప్పడానికి తలప్రాణం తోక కొచ్చింది...

" అప్పారావు - మీకు ఆఫీసరు కావచ్చు - నాకు కాదుగదా - రెంటుకు బోల్డు కార్లు బయట దొరుకుతాయి - తీసుకోమనండి - నాలుగు రోజులు కారులేక పోతే మనకెంత

యిబ్బంది !" అనిగునిసింది, కారు విరహాన్ని భరించలేక.

ఆఫీసరుతో తనకున్న అనుబంధం - ఆయన తల్చుకుంటే తనను అండమానుకు కూడా బదిలీ చేయించ గలడన్న విషయం చెప్పాడు. ఆ సంస్థలో- ఉద్యోగుల భవిష్యత్తును బాగు చెయ్యలేక పోయినా, తల్చుకుంటే ఆఫీసర్లు చెడగొట్ట కలరు! 'సి.ఆర్లు' అంటే కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు వాళ్ళ చేతుల్లో ఉంటాయి. వాట్ని బట్టే ప్రమోషన్లు వగైరా. ఏతావాతా అతనితో మంచిగుంటేనే మనకు మంచి జరుగుతుందని నచ్చచెప్పాడు.

ఎట్లాగయితేనేం సులోచనను ఒప్పించి కారిచ్చి పంపాడు. ఆ గండం గడిచింది. కాని అది చూసి అతని స్నేహితులు కూడా అడగడం మొదలెట్టారు - కాదన్న ఇతని సమాధానం విని -

"ఔనులే ! ఆఫీసరు కంటే కారిస్తావు - మా కెందుకిస్తావు! ఆయనంటే నీకు ప్రమోషను యిప్పిస్తాడు - అందుకని కాకా - మాతో ఏం అవసరం?"

అంటూ సతాయించడం మొదలెట్టారు బహిరంగంగా.

చివరికి వాళ్ళ ఒత్తిడికి తలఒగ్గి భార్యను కాళ్ళా వేళ్ళా బ్రతిమిలాడి ఒక రోజుకు, అర రోజుకు యిప్పించసాగాడు ఒక్కొక్కరికి.

విజయకుమార్‌కు విజయవాడ అర్జెంటుగా పోవాల్సిన పని పడింది. అతను అతని కోలీగు - వాళ్ళమామ సడెన్‌గా చనిపోయాడు. బస్సులో పోతే చివరి చూపు కూడా దక్కదు. అతని ఫ్యామిలీ సులోచనకు కూడా తెల్సు - అందుకని అతను ఆడగంగానే దానకర్ణుడిలా ఫీలయిపోతూ కారు యిచ్చి పంపాడు.

ఆ పోవడం - పోవడం మూడు రోజులు పోయాడు - సెల్లుమీద సెల్లు కొట్టింతర్వాత విజయవాడనుండి బయలుదేరాడు.

దోర్నాల దాటింతర్వాత నల్లమల ఫారెస్టులో కారుకు యాక్సిడెంటు అయింది. డ్రైవరుకు

కాలు విరిగింది.. విజయకుమార్ కుటుంబానికి చిన్నగాయాలయ్యాయి.

వార్త తెల్సుకుని లబలబలాడుతూ పోయాడు. ముందు భాగం తుక్కు తుక్కు అయిపోయింది. అది చూసి వలవల ఏడ్చాడు సుబ్బారావు – కన్నవాళ్ళు పోయినా అంతగా ఏడవలేదుట.

ఆ కారును అక్కడనుంచి కదిలించి వర్కు షాపుకు తేవడం ఒక భగీరథ ప్రయత్నం! ఇన్సురెన్సు కంపెనీతో పెద్ద చిక్కులు!

ముందు డ్రైవరు భార్య గౌరి సుబ్బారావు ఇంటికొచ్చి కూర్చుంది. మా అయనకు జరిగిన ఘోరానికి నష్టపరిహారం యివ్వాలంటూ. ఎంత సర్దిచెప్పినా వినలేదు – వాళ్ళ గూడెం వాళ్ళు కూడ వచ్చి కూర్చున్నారు యింటిముందర.

దాంతో అర్జెంటుగా పదివేలు పుట్టించి యివ్వాల్సి వచ్చింది.

కొంత చేతి చిలుం వదిలింతర్వాత కొంత కాలానికి కారు బయట కొచ్చింది. అప్పటికే అతనికి అప్పులు అవుతున్నాయి కారు ద్వారా. ఎందుకీ తలనెప్పని తనకు తెల్సిన వ్యాపారస్తుల ద్వారా అద్దెకు తిప్పడం మొదలెట్టాడు.

అప్పటికీ సులోచనకు కారుమీదున్న భ్రమలు పోయాయి యాక్సిడెంటుతో ఆమెనగలు కూడా బ్యాంకుకు వెళ్ళిపోయాయి తాకట్టు క్రింద. దాని పోషణకు సుబ్బారావు జీతంలో సగం కంటే ఎక్కువే అయిపోతున్నదన్న సత్యం గ్రహించింది. కొన్నాళ్ళకు కారులో కూర్చుని అడుక్కోవాలసి వస్తుందని భయపడింది.

ఉన్నట్లుండి సుబ్బారావుకు ఆపూరికి చాలా దూరంగా చిన్న పల్లెటూరుకు ట్రాన్స్ఫరైంది. ఆపుకుందామని పై ఆఫీసుకు పోయి కాళ్లవేళ్ళా పడ్డాడు. వాళ్ళు సాధ్యం కాదని తేల్చి చెప్పారు.


కారణం ఉద్యోగం కాకుండా సుబ్బారావు ఇతర వ్యాపారాలు చేస్తున్నాడని అతని మీద కంప్లైయింటు పోయిందట! ఇచ్చిన వాళ్ళు అతని కారు వాడుకున్న వాళ్ళే.

అతను నమ్ముకున్న సదరు ఆఫీసరు కూడా దాన్ని ధృవీకరించాడట! సుబ్బారావు చెవులు కొట్టుకుంటూ మొహం వ్రేలాడేసుకుని ఇంటికి చేరుకున్నాడు – సులోచన ఏడ్చింది. పిల్లల చదువులు పాడయిపోతున్నందుకు, సిటీ వదిలి ఏ వసతులూ లేని పల్లెటూరుకు పోవలసి వచ్చినందుకు.

ఇన్నాళ్ళూ అందరూ 'కారుయోగం – కారుయోగం' పట్టిందని కారుకూతలు కూశారు కాని – తమకు బేకారు యోగం పట్టిందని సులోచన – సుబ్బారావులు గ్రహించారు.

*– ఆదివారం ఆంధ్రభూమి 2 అక్టోబరు 2011*


చంద్రుని మీదకు రాకెట్లూ! అందులో మనిషి వెళ్ళారూ అంటే!?
చంద్రుని మీద దిగిన రాకెట్
అది శాస్త్రజ్ఞుల గొప్పతనమా! దేవుని గొప్పతనమా!?
ఖచ్చితంగా! శాస్త్రజ్ఞుల గొప్పతనమే!!
కానీ.. అలాంటి శాస్త్రజ్ఞులను తయారు చేసిన దేవుడే గొప్ప!!
AVM


AVM
1
2
3
4
5


1
2
3
4